కాయిదమ్మ కుంటను సుందరంగా తీర్చిదిద్దుతాం

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, అధికారులు

మియాపూర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): కాయిదమ్మకుంట చెరువును సుందరంగా తీర్చిదిద్దుతామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. సీఎస్ఆర్ నెక్సస్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ ఫండ్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పనులు చేపట్టనున్న క్రమంలో అధికారులతో కలిసి మంగళవారం ఆయన చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. కాయిదమ్మ కుంట చెరువును సందరీకరించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందిస్తామన్నారు. చెరువులోకి మురుగునీరు చేరకుండా ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు డీఈ నళిని, ఏఈ శ్రీనివాస్, సీఎస్ఆర్ ఐటీ సంస్థ ప్రతినిధులు చైతన్య, రాము పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాంధీపై కార్పొరేటర్ వ్యాఖ్యలు సరికాదు

● కాంగ్రెస్ నాయకుడు చంద్రకాంతరావు

హైదర్‌నగర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): పది నెలల క్రితం మంజూరైన రోడ్డు మరమ్మతు పనులను ఎమ్మెల్యే గాంధీ ముందుకు సాగనివ్వడం లేదంటూ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం సరికాదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చంద్రకాంత్ అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న గాంధీపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అనేక కారణాలతో రోడ్డు పనులు ప్రారంభం కాలేదని, త్వరలోనే ప్రారంభించి పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా నాగుల పంచమి పూజలు



మూసాపేటలో పూజలు చేస్తున్న మాజీ కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్



పూజలు చేస్తున్న భక్తులు



పుట్టలో పాలు పోస్తున్న మహిళ



కూకట్‌పల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గంలో మంగళవారం నాగుల పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే నాగదేవతల ఆలయాలకు భక్తులు క్యూ కట్టారు. పుట్టలో పాలు పోసేందుకు మహిళలు, యువతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శ్రావణ మంగళవారం కావడంతో కొన్ని దేవాలయాల్లో మంగళగౌరి వ్రతాలు నిర్వహించారు.

బాలాజీనగర్‌లో..

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ సంజీవని హనుమాన్ దేవస్థానంలో మంగళవారం నాగుల పంచమి వేడుకలు నిర్వహించారు. సుబ్రహ్మణ్య, నాగదేవతల విగ్రహాలకు అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

అల్లాపూర్ పరిధిలో..

3నాగపంచమి వేడుకలను తులసీనగర్, పర్వత నగర్, గాయత్రి నగర్, న్యూ రామారావు నగర్‌లతో పాటు పలు కాలనీలలో ఘనంగా నిర్వహించారు. మహిళలు నాగదేవత ఆలయాలు, పుట్టల వద్ద బారులుతీరారు. పాలు, అల్లాపూర్ డివిజన్‌లోని గాయత్రి నగర్ వాటర్‌ట్యాంక్ పార్కు వద్ద ఉన్న పుట్ట మహిళలు పూజలు చేశారు.



గాయత్రి నగర్‌లో పూజలు చేసేందుకు వచ్చిన భక్తులు



నాగదేవతకు పూజలు చేస్తున్న భక్తులు

ఆంజనేయనగర్ పార్కులో హైడ్రా ఫెన్సింగ్



అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న ముస్లింలు



ఫెన్సింగ్ ఏర్పాట్లు చేస్తున్న హైడ్రా సిబ్బంది

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ డివిజన్ ఆంజనేయనగర్‌లో పార్కు అభివృద్ధిని ఓ వర్గం దశాబ్దకాలం నుంచి అడ్డుకుంటుంది. 1991 హుడా లేఅవుట్‌లో విశాల్ మార్ట్ వెనుక సుమారు 3వేల గజాల్లో పార్కు ఉంది. అక్కడ జెండా పాతి, కమ్యూనిటీహాలు, మదర్సా నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు కొందరు. కొన్ని నెలల క్రితం ప్రహరీ నిర్మించడానికి అక్కడికి వెళ్లిన కాంట్రాక్టర్‌ను బెదిరించడంతో పనులు చేయకుండానే వెనుదిరిగారు. ఈ పార్కు గురించి హైడ్రాకు ఫిర్యాదులు వెళ్లడంతో హైడ్రా సీఐ నరేష్ ఆధ్వర్యంలో మంగళవారం జెండాను తొలగించారు. చెత్తాచెదారం తొలగించి పార్కు చుట్టూ ప్రహరీ నిర్మించారు.

హైడ్రా వస్తుందన్న సమాచారంతో స్థానిక ముస్లింలు వందలాది మంది అక్కడకు చేరుకుని అడ్డుకునే ప్రయత్నం చేసినా పోలీసులు నిలువరించారు. పార్కు ప్రాంగణంలోకి ఎవరు వెళ్లినా చర్యలు తప్పవని హైడ్రా అధికారులు హెచ్చరించారు.

గత కొన్నేళ్లుగా ఈద్గాకు ఇదే ప్రాంగణం అని చెప్పినా ఆలకించలేదని పలువురు మైనార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రాతో పార్కుకు మోక్షం లభించిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



భాగ్యనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, అధికారులు

భాగ్యనగర్‌లో పర్యటించిన కార్పొరేటర్

హైదర్‌నగర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ భాగ్యనగర్ ఫేజ్-1 కాలనీలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, శానిటేషన్, హార్టికల్చర్ విభాగం అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ఇన్‌స్పెక్టర్ మహదేవ్, ఎస్ఎఫ్ఐ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి అభివృద్ధి పట్టదా?

● అధికారులను ప్రశ్నించిన ఎమ్మెల్యే మాధవరం

● పెండింగ్ పనులు పూర్తి చేయడంలేదని ఆగ్రహం

● నిధుల కేటాయింపులపై తీవ్ర అసహనం

కూకట్‌పల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): రామారావునగర్ నాలా పనులకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరు చేశామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా పనులు ప్రారంభించలేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎస్ఎన్‌డీపీ, జీహెచ్ఎంసీ, జలమండలి, హెచ్ఎండీఏతో పాటు పలు శాఖలకు చెందిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నత్తనడకన జరుగుతున్నాయంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. కేపీహెచ్‌బీలో 1800లకు పైగా హాస్టళ్లు ఉన్నాయని, దీంతో ప్రజలకు నీటి ఇబ్బందులు వస్తున్నాయన్నారు. అధికారులు దీనిపై దృష్టిసారించాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో రూ.150కోట్లతో యూజీడీ పైప్‌లైన్‌లు వేశామని, ఇప్పటికే 80శాతం పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పారిశుధ్య నిర్వహణ లోపంతో పలుకాలనీలు కంపుకొడుతున్నాయని, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. వీవీనగర్ డివిజన్‌లో ఆరు నెలల క్రితం వేసిన రోడ్డును తవ్వి కొత్త రోడ్డు వేస్తున్నారని, కూకట్‌పల్లిలో రోడ్లు వేయాలని కోరితే నిధులు లేవనడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే కృష్ణారావు

రూ.1000 కోట్ల విలువైన భూముల అమ్మకం..

కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ హయాంలోనే సుమారు రూ.1000 కోట్ల విలువచేసే భూములు అమ్ముకున్నారని, అందులో 30శాతం నిధులు ఇక్కడి ప్రజల అభివృద్ధి కోసం కేటాయించాలని ఎమ్మెల్యే కృష్ణారావు డిమాండ్ చేశారు. ఇక్కడి ప్రజలు కూడా అందరిలానే పన్నులు చెల్లిస్తున్నారని, అయితే 9 డివిజన్‌లు ఉన్న కూకట్‌పల్లి అభివృద్ధికి కేవలం రూ.6 కోట్లు కేటాయించి, పక్కనే ఉన్న నియోజకవర్గానికి రూ.25కోట్లు కేటాయించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేపీహెచ్‌పీ, బాలానగర్, ఫతేనగర్, అల్లాపూర్, కూకట్‌పల్లి, ఓల్డ్ బోయినపల్లి, బాలాజీనగర్, మూసాపేటలో శ్మశాన వాటికలు, రోడ్లు, నాలా పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముద్దం నరసింహయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, సబిహా గౌసుద్దీన్, మందాడి శ్రీనివాసరావు, పగుడాల శిరీష, అధికారులు పాల్గొన్నారు.



చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, అధికారులు

కాయిదమ్మకుంట చెరువును సుందరంగా తీర్చిదిద్దుతాం

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): కాయిదమ్మకుంట చెరువును సుందరంగా తీర్చిదిద్దుతామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. సీఎస్ఆర్ నెక్సస్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ ఫండ్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పనులు చేపట్టనున్న క్రమంలో అధికారులతో కలిసి మంగళవారం ఆయన చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. కాయిదమ్మ కుంట చెరువును సుందరీకరించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందిస్తామన్నారు. చెరువులోకి మురుగునీరు చేరకుండా పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు డీఈ నళిని, ఏఈ శ్రీనివాస్, సీఎస్ఆర్ ఐటీ సంస్థ ప్రతినిధులు చైతన్య, రాము తదితరులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ అధికారులు

రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన

హైదరాబాద్ సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఐటీ కారిడార్‌లో అత్యంత కీలకమైన ఐటీ సెజ్‌గా ఉన్న రహేజా మైండ్ స్పేస్ గేట్ వద్ద ఆటో డ్రైవర్లకు మాదాపూర్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ హనుమంతరావు, ట్రాఫిక్ ఏసీపీ కె.సత్యనారాయణ రోడ్డు భద్రత నిబంధనలను వివరించారు. ప్రజా రవాణా వ్యవస్థలో ఆటో రిక్షాలు ఎంతో కీలకమని, నిత్యం లక్షలాది మందిని గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయని వారు పేర్కొన్నారు. అయితే ఆటో డ్రైవర్ల తీరుపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్న క్రమంలో వారితోనే నేరుగా ట్రాఫిక్ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. రోడ్డు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని డ్రైవర్లకు సూచించారు. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో పార్కింగ్ కేటాయించిన చోటే ఆటో రిక్షాలను నిలపాలని, ఆటో సేఫ్ పేరుతో రూపొందించిన స్టిక్కర్‌లను ఆటో ముందు, వెనుక, మధ్య భాగంలో అంటించుకోవాలని సూచించినట్లు ఏసీపీ సత్యనారాయణ తెలిపారు.

సైబర్ టవర్స్ చౌరస్తాలో..

సైబర్ టవర్స్ జంక్షన్‌లో మంగళవారం మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు ఐటీ ఉద్యోగులతో కలిసి రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. రహేజా మైండ్ స్పేస్‌లోని ఆన్‌వార్డ్ టెక్నాలజీస్ లిమిటెడ్‌కు చెందిన ఉద్యోగులు మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శించి ప్రచారం చేశారు. ట్రాఫిక్ జామ్ అయినప్పుడు వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని, ట్రాఫిక్ సమస్యలకు దారితీసే అంశాలపై సమాచారం అందించాలని వాహనదారులకు సూచించారు.

ఘనంగా నాగుల పంచమి పూజలు



చందానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయ సముదాయంలో నాగదేవతలకు పూజలు చేస్తున్న భక్తులు



శాంతినగర్ నాగదేవత ఆలయంలో భక్తులు

చందానగర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నాగదేవతలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పలు ఆలయాల్లో నాగదేవతలకు పంచామృతాభిషేకాలు, అర్చనలు, పాలాభిషేకం చేశారు. పుట్టలో పాలు పోసి మహిళలు, యువతులు మొక్కు లు చెల్లించుకున్నారు. విశాఖ శారదా పీఠ పాలిత వెంకటేశ్వరస్వామి ఆలయ సముదాయంలోని నాగదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. చందానగర్ శాంతినగర్, శిల్పాఎన్‌క్లేవ్‌లోని లక్ష్మీగణపతి, హుడా కాలనీ అభయాంజనేయస్వామి, తారానగర్ పోచమ్మ, హుడాకాలనీ శివాలయం, పీజేఆర్ ఎన్‌క్లేవ్ జగద్రక్షక శ్రీధర్మ శాస్త్ర, మియాపూర్‌లోని ధర్మపురి క్షేత్రం, రామాలయం, మదీనగూడ వెంకటేశ్వరస్వామి, వేముకుంట నల్లపోచమ్మ ఆలయం, రాజీవ్‌నగర్ ముత్యాలమ్మ, పోచమ్మ, శేరిలింగంపల్లి డివిజన్ పాపిరెడ్డికాలనీ శివాలయం, శేరిలింగంపల్లి శివాలయం, కొండాపూర్, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, ఖాజాగూడ, రాయదుర్గం, హైటెక్ సిటీ, కొత్తగూడ, మాదాపూర్, హఫీజ్‌పేట్ తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. నాగదేవతలను పూజిస్తే కాల సర్ప దోషాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఈ క్రమంలో నాగుల పంచమి రోజున నాగదేవతలను ప్రత్యేక పూజలు చేశారు.



శాంతినగర్‌లోని ఆలయంలో నాగదేవతలు



లింగంపల్లిలో చెత్తకుప్పలు తొలగించిన ప్రాంతం

చెత్తకుప్పల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గచ్చిబౌలి, జూలై 29(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బదులు పడుతున్నారని ఈ నెల 27న 'పందుల బెడద.. చెత్త వ్యథ' పేరుతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించారు. సమస్య పరిష్కారానికి సహకరించిన ఆంధ్రజ్యోతికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే గాంధీపై కార్పొరేటర్ రోజాదేవి వ్యాఖ్యలు సరికాదు

● కాంగ్రెస్ నాయకుడు చంద్రకాంతరావు

హైదర్‌నగర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): పది నెలల క్రితం మంజూరైన రోడ్డు మరమ్మతు పనులను ఎమ్మెల్యే గాంధీ ముందుకు సాగనివ్వడం లేదంటూ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం సరికాదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చంద్రకాంత్ అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న గాంధీపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అనేక కారణాలతో రోడ్డు పనులు ప్రారంభం కాలేదని, త్వరలోనే ప్రారంభించి పూర్తిచేస్తామన్నారు.

ఏబీవీపీ సభ్యత్వ నమోదు

హైదర్‌నగర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ కూకట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థుల సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు జానా రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న ఏకైక సంస్థ ఏబీవీపీ అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ధనుంజయ్, గణేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



దత్తసాయి కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్, అధికారులు

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

మియాపూర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ పరిధిలోని కాలనీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. డివిజన్ పరిధిలోని దత్తసాయి కాలనీలో అధికారులతో కలిసి మంగళవారం కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో నిలిచిపోయిన భూగర్భ డ్రైనేజీ పనులను పూర్తి చేస్తామన్నారు. కాలనీలో మురుగు నీరు, తాగునీటి పైపులైన్లు, రోడ్ల వంటి పలు రకాల పనులను త్వరలోనే చేపడతామన్నారు.



భాగ్యనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ నార్నె, అధికారులు

భాగ్యనగర్‌లో పర్యటించిన కార్పొరేటర్

హైదర్‌నగర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ భాగ్యనగర్ ఫేజ్-1 కాలనీలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, శానిటేషన్, హార్టికల్చర్ విభాగం అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ఇన్‌స్పెక్టర్ మహదేవ్, ఎస్ఎఫ్ఐ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమించి వ్యాపారాలు

● నిషేధిత మత్తుపదార్థాల విక్రయం

గచ్చిబౌలి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కొందరు చిరు వ్యాపారులు హెచ్ఎండీఏ స్థలాన్ని ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. అందులో ఓ వ్యక్తి ఓ అడుగు ముందుకేసి మత్తు పదార్థాలు, గంజాయి విక్రయిస్తున్నాడు. కూల్‌డ్రింక్ షాపు పేరుతో వ్యాపారం చేస్తున్న అతడు లోపల నిషేధిత మత్తుపదార్థాలు అమ్ముతున్నాడు. ప్రభుత్వ స్థలంలోనే సిటింగ్ రూమ్‌ను సైతం ఏర్పాటు చేయడం గమనార్హం. శేరిలింగంపల్లి పరిసర ప్రాంతాల నుంచి యువత ఇక్కడ పెద్ద సంఖ్యలో చేరి మత్తుపదార్థాలు కొనుగోలు చేస్తున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఈ తంతు నడుస్తునందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదని చెబుతున్నారు. దీనిపై చందానగర్ ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌గౌడ్‌ను వివరణ కోరగా విషయం తమ దృష్టికి వచ్చిందని, నిషేధిత మత్తుపదార్థాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మత్తుపదార్థాలు విక్రయిస్తున్న ప్రభుత్వ స్థలంలోని దుకాణం

మూసివేసిన రోడ్డును తెరిపించాలని వినతి

హైటెక్ సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): రహదారిని తెరిపించాలని కోరుతూ బీజేపీ బోరబండ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేష్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం శేరిలింగంపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మాదాపూర్ డివిజన్ శేరిలింగంపల్లి మండలం పరిధిలోని గుట్టలబేగంపేట సర్వేనంబర్ 17/2లో 30 ఏళ్లుగా నడకదారి ఉంది. ఇటీవల ఓ బిల్డర్ ఆ రహదారిని మూసివేసి చుట్టూ రేకులతో కాంపౌండ్ ఏర్పాటు చేశారు. దీంతో బోరబండ ప్రాంతం నుంచి మాదాపూర్ నడిచి వెళ్లే వారంతా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది. బీజేపీ నాయకుల ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతంలో సర్వే చేయించి రహదారిని తెరిచేలా చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి కుమ్మరి సతీష్, పార్టీ నాయకుడు వినోద్ పాల్గొన్నారు.





భర్త వేధిస్తున్నాడనే హత్యకు పథకం !

- వ్యక్తిపై హత్యాయత్నం కేసును ఛేదించిన పోలీసులు
- భార్యతో సహా ఆరుగురి రిమాండ్

దుండిగల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : భర్తపై భార్య హత్యాయత్నం చేయించిన కేసును పోలీసులు ఛేదించారు. నిత్యం తనను వేధిస్తున్న భర్తను కొట్టి తన వద్ద నుంచి తరిమేయడం లేదా.. చంపేయాలనే ఉద్దేశంతోనే భార్య ఈ ఘాతుకాని పాల్పడినట్టు పోలీసులు తేల్చారు. భార్యతో మరో ఐదుగురిపై కేసు నమోదు చేసిన దుండిగల్ పోలీసులు నిందితులను మంగళవారం రిమాండ్‌కు తరలించారు. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... వనపర్తి జిల్లా, పెదగూడెం తండాకు చెందిన రాందాస్ నాయక్‌కు అదే ప్రాంతానికి చెందిన జ్యోతి అనే మహిళతో 16 ఏళ్ల క్రితం పెళ్లైంది. వీరికి ఇద్దరు సంతానం. కొన్నేళ్ల క్రితం భర్త రాందాస్ నాయక్‌తో మనస్పర్థలు రావడంతో జ్యోతి వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, 498 కేసు కూడా నమోదైంది.ఈ నేపథ్యంలో మూడేళ్లుగా భార్యాభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. జ్యోతి తన ఇద్దరు కూతుళ్లను తన తల్లి వద్ద ఉంచి, ఆమె నిజాంపేట రాజీవ్‌గృహకల్పలో నివాసముంటూ ప్రగతినగర్ ప్రాంతంలో రొట్టెలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. నెల రోజుల క్రితం పెద్ద మనుషులు సర్ది చెప్పి భార్యాభర్తలిద్దరూ రాజీవ్ గృహకల్పలో జ్యోతి ఉంటున్న ఇంట్లో ఉండేలా చేశారు. కొద్ది రోజులకే మళ్లీ భార్యాభర్తల మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి.వారం రోజుల నుంచి రాందాస్ భార్యను హింసించడం మొదలెట్టాడు. దీంతో విసుగు చెందిన జ్యోతి ఎలాగైనా భర్తను కొట్టి ఇక్కడ నుంచి తరిమేయాలని లేదా చంపేయాలని నిర్ణయానికి వచ్చింది.

స్నేహితుడు, బంధువు సాయంతో..

తన పథకాన్ని స్నేహితుడు గోపి, బంధువు హేమంత్‌కు చెప్పి అమలు చేయాలని కోరింది. ఈ నెల 26న రాత్రి 8.30 గంటలకు జ్యోతి భర్త రాందాస్ నాయక్‌కు ఫోన్ చేసి తాను రొట్టెలు చేస్తున్న ప్రాంతానికి రావాలని కోరింది. అప్పటికే అక్కడ ఉన్న గోపి, హేమంత్ తమ పథకంలో భాగంగా రాందాస్‌నాయక్‌ను మద్యం తాగుదామంటూ బైక్‌పై ఎక్కించుకొని వీఎన్ఆర్ కాలేజీ పక్కన ఉన్న చివాస్ వైన్స్ వద్దకు వెళ్లారు. అక్కడ బీర్లు తీసుకొని బౌరంపేట పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న లహరీ గ్రీన్ పార్కు వద్దకు తీసుకెళ్లారు. అదే సమయంలో గోపి తన స్నేహితుడైన శ్రీకాంత్‌కు ఫోన్ చేసి లహరీ గ్రీన్ పార్కుకు వద్దకు రావాలని కోరాడు.

శ్రీకాంత్‌తో పాటు కరీమ్‌ముద్దీన్, సుబోధ్ అనే మరో ఇద్దరు రాగా, రాందాస్ నాయక్‌పై దాడి చేయాలని గోపీ చెప్పాడు. రాందాస్ మద్యం తాగుతుండగా, గోపి, హేమంత్ శ్రీకాంత్, కరీమ్‌ముద్దీన్, సుబోధ్‌లు మూకుమ్మడిగా బీరు సీసాలు, రాళ్లతో దాడి చేశారు. రక్తగాయాలు కావడంతో రాందాస్ నాయక్ స్పృహతప్పి పడి పోయాడు. చనిపోయాడని భావించి ఐదుగురు అక్కడి నుంచి పారి పోయారు. అర్ధరాత్రి ఒంటి గంటల తర్వాత స్పృహలోకి వచ్చిన బాధితుడు రాజీవ్‌గృహకల్పలో ఉంటున్న తన సోదరుని ఇంటికి వెళ్లి, మమత ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని, బాచుపల్లి పోలీసులను ఆశ్రయించాడు. బాచుపల్లి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి దుండిగల్ పీఎస్‌కు బదిలీ చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు జ్యోతితో పాటు నిందితులు ఆరుగురినీ అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

తాగి డ్రైవింగ్ చేసిన ఐదుగురికి జైలు

పేట్‌బషీరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి : మద్యం తాగి వాహనాలు నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ ఐదుగురిని అత్తెల్లి కోర్టు ఆదేశాల మేరకు అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం జైలుకు తరలించారు. వీరిలో వికాస్ అనే వ్యక్తికి నాలుగు రోజులు, సోమ్లా నాయక్, అమర్‌నాథ్, మల్లేష్, షేక్ వల్లీలకు రెండు రోజులు జైలు శిక్షతో పాటు జరిమానాను మేజిస్ట్రేట్ విధించారని ట్రాఫిక్ సీఐ నాగరాజు తెలిపారు. అందరినీ చర్లపల్లి జైలుకు తరలించామన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని, మద్యం తాగి వాహనాలను నడపొద్దని, నిడిపితే జైలు శిక్ష, జరిమానా తప్పదని సీఐ హెచ్చరించారు.

పైసలిస్తేగాని ఫైల్ కదలదు!

- అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం
- ప్రజలను పట్టిపీడిస్తున్న ప్రైవేట్ సైన్యం
- విద్యార్థుల సర్టిఫికెట్ల జారీకీ డబ్బుల వసూలు
- చెల్లించలేక బోరుమంటున్న పేద విద్యార్థులు



కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం

జీడిమెట్ల/గాజులరామారం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. ఇక్కడ ఏ పని కావాలన్నా.. చివరకు విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లు జారీ చేయాలన్నా పైసలిస్తేగాని ఫైల్ కదలడం లేదు. దీంతో సర్టిఫికెట్లు జారీ కాక, డబ్బులు ఇవ్వలేక పేద విద్యార్థులు బోరుమంటున్నారు. నిరుపేద ఆడపిల్లల పెళ్లి చేస్తే ప్రభుత్వం అందిస్తున్న కల్యాణలక్ష్మి చెక్కులు లబ్ధిదారుల చేతికి అందాలన్నా వీరికి రూ.10 వేలు ముట్ట చెప్పాల్సిందేనని పలువురు ఆరోపిస్తున్నారు.

8 మంది ప్రైవేట్ వ్యక్తులు..

గాజులరామారం ప్రాంతలోని మహదేవపురంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో 20 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వీరితోపాటు గత ప్రభుత్వ హయాం నుంచి (పదేళ్లుగా) ఇక్కడ ఎలాంటి జీతాలు లేకుండా అనధికారికంగా ఎనిమిది మంది ప్రైవేట్ వ్యక్తులు పని చేస్తున్నారు. ఈ ప్రైవేట్ సైన్యం ప్రజలను పట్టిపీడిస్తోంది. కార్యాలయంలోని ప్రతి సెక్షన్‌లో వీరు చెప్పిందే వేదం, చేసిందే చట్టం అన్నట్టుగా ఉంది పరిస్థితి. ఇక్కడ పనిచేస్తున్న అధికారులు కూడా వీరి చెప్పు చేతల్లోనే ఉన్నారంటే అతిశయోక్తికాదు. అధికారులు తమ చేతులకు మట్టి అంటకుండా వీరి ద్వారా కాసుల వర్షం కురుస్తుండటంతో వీరు చేసే ప్రతి పనినీ సమర్థిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

● పాస్‌వర్డ్స్ కూడా వీరి వద్దే..

కుల, ఆదాయ, నివాస, ఫ్యామీ సర్టిఫికెట్, పహాణీలు, ఎన్ఓసీలు.. ఇలా ఎటువంటి సర్టిఫికెట్ జారీ చేయాలన్నా వీరు కీలక పాత్ర పోషిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బందికి మాత్రమే తెలియాల్సిన ఆన్‌లైన్ అధికారిక పాస్‌వర్డ్స్ కూడా వీరికి తెలుసు అంటే ఈ కార్యాలయాన్ని వీరు ఏ స్థాయిలో శాసిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నా, కేవలం బ్రోకర్లు, ప్రైవేట్ మీసేవల నుంచి వచ్చేవాటికి ముందు ప్రాధాన్యత ఇచ్చి రోజూ పెద్ద మొత్తంలో డబ్బు సంపాదిస్తున్నారు. సామాన్యులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి కాళ్లరిగేలా తిరిగినా పని కావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ ప్రైవేట్ సైన్యం భూకబ్జాదారులతో కుమ్మక్కై, కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాల కబ్జాలను ప్రోత్సహిస్తోందని, వీరికి కార్యాలయంలోని కొందరు ఉన్నతాధికారుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు కుత్బుల్లాపూర్ మండల కార్యాలయంలో ఈ ప్రైవేట్ సైన్యం సాగిస్తున్న అవినీతి బాగోతానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని, వీరు కార్యాలయంలో అడుగుపెట్టకుండా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేట్ వ్యక్తులను తక్షణమే ఆపేస్తాం



ఇటీవలే నేను ఇక్కడ తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్నా. మా కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తులు పని చేస్తున్న విషయం నా దృష్టికి రాలేదన్నారు. ఎవరైనా అనధికారికంగా పని చేస్తుంటే విచారణ జరిపి వారు కార్యాలయంలో అడుగుపెట్టకుండా చర్యలు తీసుకుంటా. అవినీతికి పాల్పడే సిబ్బంది, అధికారులపై కఠిన చర్యలు తప్పవు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నా దృష్టి తీసుకురావాలని కోరుతున్నా.

-పి.సుజాత, కుత్బుల్లాపూర్ తహసీల్దార్

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



జగద్గిరిగుట్టలో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు



రుక్మిణి ఎస్టేట్స్ ఉమామహేశ్వర కాలనీలో ..



నాగదేవత గుడిలో కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

పేట్‌బషీరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మంగళవారం నాగుల పంచమిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నిజాంపేట కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి పురపాలక సంఘం,కుత్బుల్లాపూర్, గాజులరామారం జంటసర్కిళ్ల పరిధిలోని ఆలయాల్లోని నాగేంద్రుడు, నాగదేవత విగ్రహాలకు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. పుట్టలో పాలు, కోడిగుడ్డులు, పేలాలు పోసి, టెంకాయ కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఎక్కడ చూసినా ఆలయాలు, పుట్టల వద్ద భక్తుల సందడి కనిపించింది.

ఘనంగా నాగదేవత కల్యాణోత్సవం

నాగుల పంచమి సందర్భంగా రంగారెడ్డినగర్ డివిజన్ గిరినగర్‌లోని నాగదేవత ఆలయంలో నాగదేవత కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హాజరై అమ్మవారికి పూజలు చేశారు. కల్యాణోత్సవంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శంకరయ్య, మహిళా అధ్యక్షురాలు రాణి, పలువురు నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల స్కామ్‌లో మరో నిందితుడిపై కేసు

- నిందితుడు జీహెచ్ఎంసీ ఉద్యోగి

జీడిమెట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సంచలనం రేపిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల స్కామ్‌లో మరో నిందితుడిపై బాధితులు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘరానా మోసగాడు దాదాపు 40 మంది నుంచి కోటి రూపాయల వరకు వసూలు చేసినట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడు జీహెచ్ఎంసీలో ఉద్యోగి కావడం విశేషం. జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల అపురూప కాలనీకి చెందిన ఎ.నిర్మల్‌బాబు తాను జీహెచ్ఎంసీ ఉద్యోగినని, తనకు మేడ్చల్ కలెక్టర్ కార్యాలయంలోని అధికారులంతా తెలుసునని డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని పలువురిని నమ్మించాడు. ఒక్కొక్కరి నుంచి 2 నుంచి 3 లక్షల రూపాయల చొప్పున 40 మంది నుంచి కోటి రూపాయలకు పైగా వసూలు చేశాడు. షాపూర్‌నగర్ ఎన్ఎల్‌బీనగర్‌కు చెందిన బత్తుల శ్రీనివాస్ అనే ప్రైవేట్ ఉద్యోగి డబుల్ బెడ్రూమ్ ఇల్లు వస్తుందన్న ఆశతో తన స్నేహితుడు ఎం.శ్రీనివాస్ ద్వారా నిర్మల్‌బాబుకు 2022 జూన్‌లో తనకు, తన తల్లి పేరు మీద రెండు ఇళ్లు కావాలని రూ. 4 లక్షలు చెల్లించాడు. ఇలా సుమారు 40 మంది నుంచి డబ్బులు తీసుకొని మోసం చేశా డు. దీంతో బాధితులు అనేక సార్లు అతని ఇంటి చుట్టూ తిరిగినా డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసలుఃఉ నిర్మల్‌బాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.